రైలు బండిలా.. రైతులు దండిగా


హన్వాడ ఎఫ్‌పీసీఎస్ ప్రాంగణంలో తెల్లవారుజాము నుంచి రైతుల భారీ క్యూలైన్


మూసాపేటలో యూరియా కోసం ఎగబడ్డ రైతులు


హన్వాడలో మహిళలకు క్యూలైన్‌లో సర్దిచెప్తున్న ఎస్‌ఐ


నవాబుపేట: ఆగ్రోస్ సెంటర్ చెంత బారులుదీరిన రైతులు


లక్ష్మీపల్లి రైతువేదికలో పంపిణీ చేస్తున్న అధికారులు

హన్వాడ/దేవరకద్ర/నవాబుపేట/అడ్డాకుల: యూరియా కోసం రైతులు పోటెత్తారు.. రెండురోజుల కిందట యూరియా కోసం నిరసన దిగడంతో ఒకేసారి ఏడు వందల మందికిపైగా రైతులకు టోకెన్లను జారీచేసి మరుసటి రోజుకు వాయిదా వేయడంతో టోకెన్లు పొందిన రైతులు తెల్లవారుజామునే ఎఫ్‌పీసీఎస్ ప్రాంగణానికి చేరుకుని క్యూలైన్‌లో నిల్చున్నారు. టోకెన్లు పొందిన రైతులకు తోడు రెట్టింపు రైతులు తరలిరావడంతో ఎఫ్‌పీసీఎస్ ప్రాంగణమంతా క్యూలైన్‌లతో నిండిపోయింది. ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది, ఏఓ కిరణ్‌కుమార్ పరిస్థితిని సమీక్షించారు. ఉదయం ఆరుగంటలకే 12వందల బస్తాల యూరియాను పంపిణీ చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఇదిలా ఉండగా టంకరకు చెందిన నందు అనే 5వ తరగతి విద్యార్థి తండ్రికి బదులుగా తెల్లవారుజామున 3గంటలకే వచ్చి క్యూలైన్‌లో నిల్చున్నాడు. మరో 2వందల మంది రైతులకు ఎస్‌ఐ ఆధ్వర్యంలో కొత్త టోకెన్లు జారీ చేశారు.

➡ రైతులు దేవరకద్రకు వచ్చి ఆందోళనకు దిగుతుండడంతో అధికారులు నేరుగా గ్రామాలకే తీసుకెళ్లి విక్రయించారు. బుధవారం లక్ష్మీపల్లిలోని రైతువేదికలో లక్ష్మీపల్లి, హజిలాపూర్, బస్వాయపల్లి, చౌదర్‌పల్లి రైతులకు యూరియాను అందజేశారు. బుధవారం దేవరకద్రకు యూరియా రాకపోవడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు రాయిచూర్ రోడ్డుపై ఆందోళన దిగి రాస్తారోకోను చేశారు. స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చచెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

➡ యూరియా కోసం రైలు బండిలా.. రైతుల క్యూలు కొనసాగాయి. బుధవారం మండల కేంద్రంలో ఆగ్రో కేంద్రాలకు యూరియా సరఫరా కావడంతో రైతులు వాటికోసం ఎగబడ్డారు. సాయంత్రం యూరియా రావడంతో అన్నదాతలు క్యూలైన్లు కట్టి వాటికోసం నిరీక్షించారు. వేయి బస్తాల యూరియాను వేర్వేరుగా మూడు కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచి అందించినట్లు ఏఓ కృష్ణకిషోర్ తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున రావడంతో ఎస్‌ఐ విక్రమ్ పోలీసు పహారాలో యూరియా పంపిణీ చేయాల్సి వచ్చింది.

➡ మూసాపేట మండల కేంద్రంలో బుధవారం రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. స్థానిక ప్రైవేటు డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉండడంతో మూసాపేట, నిజాలాపూర్, సంకలమద్ది, వేముల, తుంకినీపూర్, అచ్చాయపల్లి, కొమిరెడ్డిపల్లి, మహ్మదుస్సేన్‌పల్లికి చెందిన రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచే చెప్పులను వరుసలో ఉంచి షాపు ముందు వేచి ఉన్నారు. ఈనెల 4వ తేదీ టోకెన్లు పొందిన రైతులు యూరియాకు ఎగబడడంతో పోలీసులు సముదాయించారు. ఏఓ అనిల్‌కుమార్ రైతులను వరుసలో ఉంచి పోలీసుల సహకారంతో యూరియా పంపిణీ చేయించారు. మధ్యాహ్నం వరకు రైతులు షాపు ముందు వరుస కట్టారు.

క్లుప్తంగా

నేడు పట్టణంలో కరెంట్ కట్

జిడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని దోనల్ల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు కొత్తవి మార్చడంతో గురువారం జిల్లాకేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు విద్యుత్ శాఖ పటట్ట ఏడీ తావుర్యానాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో దోనల్ల, ఫరూక్ మసీద్, బీకేరెడ్డి కాలనీ, ఆటోస్టాండ్, హ్యాపీ హోమ్స్, శేషాద్రినగర్ ప్రాంతాల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల దాక విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థికి సన్మానం



అడ్డాకుల: మూసాపేట మండలం వేములకు చెందిన ఆంజనేయులు కుమారుడు విఘ్నేశ్ జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. జానంపేటలోని విశ్వభారతి పాఠశాలలో చదువుతూ 2024–25వ సంవత్సరంలో 6వ తరగతి నవోదయ ప్రవేశాలకు పరీక్ష రాయగా.. రెండో కౌన్సెలింగ్‌లో పీయూలో కొత్తగా ఏర్పాటు చేసిన నవోదయ పాఠశాలలో సీటు పొందినట్లు ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు. బుధవారం విద్యార్థితో పాటు తండ్రిని పాఠశాల నిర్వాహకులు శాలువాతో సత్కరించి అభినందించారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని సాంధిప పాఠశాల విద్యార్థిని సాన్విత నవోదయ పాఠశాలకు ఎంపికైంది. అందుకు పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం విద్యార్థినిని శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థిని ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కాంతయ్య, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఉత్తమ టీచర్లకు సన్మానం



నవాబుపేట: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారికి బుధవారం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. లోకిరేవు హెచ్‌ఎం ప్రకాశ్, కారుకొండ జెడ్పీ పాఠశాలకు చెందిన కృష్ణకుమార్, కూచూర్ పాఠశాలకు చెందిన జగదీశ్వర్‌రెడ్డిని ఎమ్మార్సీ ఆవరణలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దశరథ్‌నాయక్, రాములు, విజయ్‌కుమార్, రవిశంకర్ తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చుతో పింఛన్లు

నవాబుపేట: వృద్ధులు, వికలాంగులకు సొంత ఖర్చుతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి బుధవారం మండల కేంద్రంలో 227 మందికి ఒక్కొక్కరికి రూ.200ల చొప్పున పింఛన్లను అందజేశారు. ప్రభుత్వం పథకాలను పోలిన విధంగా వృద్ధులు, వికలాంగులకు తన సొంత ఖర్చుతో పింఛన్ల కార్యక్రమం చేపట్టి పేదలకు చేయూతనిస్తున్నాడు. కార్యక్రమంలో వ్యాపార సంఘాల మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి, ఆంజనేయులు, నిరంజన్, రమేశ్, మహేశ్, నసీర్ తదితరులు ఉన్నారు.

ఎకో బ్రిక్స్‌పై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఏబీవీపీ కార్యాలయంలో ఏబీవీపీ–ఎస్ఎఫ్‌డీ విభాగం ఆధ్వర్యంలో ఎకో బ్రిక్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ దేశంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వినియోగం జరుగుతుందని, దాన్ని నిర్లక్ష్యంగా బయటపారవేయకుండా, తిరిగి వినియోగించుకునే విధంగా ఏకో బ్రిక్స్ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివరాం, శివ, పావని, చరణ, నవీన్, వాసు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఏనుగొండ కేజీబీవీలో ఫుడ్‌సేఫ్టీ అధికారిని శ్రీలత తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు కిచెన్, స్టోర్‌లో విద్యార్థులకు అందిస్తున్న వస్తువులలో నాణ్యతను పరిశీలించారు. భోజనం విషయంలో నాణ్యతా, ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధీర వనిత చాకలి ఐలమ్మ


జిల్లా కేంద్రంలో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సమాజ్ నాయకులు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- చాకలి ఐలమ్మకు ఘననివాళి

మహబూబ్‌నగర్‌మున్సిపాలిటీ/మెట్టుగడ్డ/అడ్డాకుల/హన్వాడ/ జడ్చర్లటౌన్/ నవాబుపేట/ భూత్పూర్/ మహబూబ్‌నగర్ న్యూటౌన్ /మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ /మహబూబ్‌నగర్ రూరల్/మహమ్మదాబాద్/గండేడ్ : తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినింపిన వీరవనిత చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం పద్మావతికాలనీలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

❂ తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరమాత, తెలంగాణ ఉద్యమకారిణి తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినింపిన వీరవనిత చాకలి ఐలమ్మ అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్‌లో ఐలమ్మ విగ్రహానికి వివిధ కులసంఘాల నాయకులు, కులపెద్దలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, ప్రైవేట్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వెంకట్రాములు, దుర్గేశ్, శివప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

❂ జిల్లాకేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, సుబ్బారావు, శ్రీనివాసులు, భానుతేజ, నందకిషోర్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

❂ సీపీఎం జిల్లా కార్యాలయంలో ఐలమ్మ చిపత్రపటానికి జిల్లా కార్యదర్శి రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కిల్లెగోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

❂ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ అజ్మీరా రాజన్న, మేనేజర్ వెంకటేశ్వరరావు, ఆర్ఓ–2 యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

❂ పీయూలో వీసీ శ్రీనివాస్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

❂ అడ్డాకుల మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మురళీధర్‌రావు, నారాయణ, రాఘవ, రమేశ్‌గౌడ్, సత్యనారాయణ, దొరబాబు, రాంచంద్రయ్య, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

❂ హన్వాడ మండలకేంద్రంలో సీపీఎం నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి లక్ష్మయ్య, నాయకులు రాములు, వివిధ గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

❂ జడ్చర్ల మున్సిపాలిటీలోని నేతాజీచౌరస్తాలో ప్రజాసంఘాల నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె పోరాట పటిమను వివరించారు. నాయకులు జగన్, సత్తయ్య, నాగరాజు, దీప్లానాయక్, వెంకటేశ్, జంగయ్య, మహేశ్, కర్ణ, ప్రసాద్, వెంకటమ్మ, బందిగమ్మ పాల్గొన్నారు.

❂ నవాబుపేట మండల కేంద్రంతోపాటు యన్మన్‌గండ్ల, లోకిరేవు, లింగంపల్లి, కొల్లూర్‌లో ఐలమ్మ చిత్రపటాలకు బీజేపీ జిల్లా నాయకుడు శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శి గణేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

❂ భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, ఫారూఖ్, ఫజల్, ఫిరోజ్, రజకులు తదితరులు పాల్గొన్నారు.

❂ మహమ్మదాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, రజక సంఘం మండలాధ్యక్షుడు శ్రీరాములు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గండేడ్ మండల కేంద్రంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నవార్వాల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కృష్ణ నివాళులర్పించారు.


జిల్లాకేంద్రంలో నివాళులర్పిస్తున్న బీసీ జాగృతి సేన నాయకులు


మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఏఎంసీ రాజన్న, కార్యాలయ సిబ్బంది


జడ్చర్ల మున్సిపాలిటీలోని నేతాజీ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఎస్ఓ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్(సి)ని ప్రత్యేక అధికారి డీఎస్ఓ శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో పరిసరాలు, వంటగది, స్టోర్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఉన్నతంగా ఎదగాలని, హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీఓ అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, సంక్షేమాధికారి స్వప్నప్రియ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌పై ఆరోపణలు మానుకోవాలి'


మాట్లాడుతున్న టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే, కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, కౌకుంట్ల మండలాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం దేవరకద్రలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగతంగా మోసానికి పాల్పడి జైలుకు వెళ్లిన నాయకుడు విడుదలైతే గొప్పలు చెప్పుకోవడం వారికే చెల్లిందని.. 21నెలల కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టిసారించారని.. చిల్లర పనులపై కాదన్నారు. కేసులు పెట్టించడం బీఆర్ఎస్‌కే చెల్లునని.. పదేళ్ల పాలనలో కాంగ్రెస్ వారిని ముప్పుతిప్పలు పెట్టిన విషయం ఎవరూ మరువరన్నారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు బనాయించారని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని తెలిపారు. సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, నాయకులు అంజన్‌కుమార్‌రెడ్డి, బాలస్వామి, ఫారూఖ్, నర్సింహారెడ్డి, రాంపాండు, ఆదిహన్మంతరెడ్డి, నర్వశ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న సీహెచ్ఓ, ఎస్‌హెచ్ఓలపై చర్యలు తీసుకోవాలని కార్మికులు ఎమెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కార్మికులపై అధికారుల తీరును వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చెన్నయ్య, మొగులన్న, రంగన్న, రాఘవేందర్, యాదయ్య పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణలో మొదటి స్థానం

- ముడా నిధులతో వివిధ పనులకు శంకుస్థాపన



వీరన్నపేటలో నైపుణ్యాభివృద్ధి కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళలు అత్యధికంగా నైపుణ్య శిక్షణను పొందుతున్నది పాలమూరులో నేనని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాతతోటలోని పోచమ్మ గుడి ఆవరణలో ముడా నిధులు రూ.15 లక్షలతో కామన్‌షెడ్, టీడీగుట్ట నుంచి కొత్త చెరువు రోడ్డు వరకు రూ.35 లక్షలతో సీసీరోడ్డు పనులు, వీరన్నపేటలోని కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో రూ.38.20 లక్షలతో నిర్మించనున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాయనీర్ కార్యక్రమం ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఐఐటీ, నీట్ వంటిపోటీ పరీక్ష కోసం విద్యార్థులకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

డంపింగ్ యార్డు పరిశీలన


బయో మైనింగ్ ద్వారా వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని తెలుసుకుంటున్న సిరిసిల్ల రాజయ్య

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని డంపింగ్ యార్డును బుధవారం సాయంత్రం రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పరిశీలించారు. కాగా, అక్కడి డీఆర్‌సీసీలో పొడి చెత్త వేరు చేసి రీసైక్లింగ్ కోసం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నామని నిర్వాహకులు వివరించారు. అలాగే కర్మి కంపోస్టు యూనిట్‌ను తనిఖీ చేశారు. తడి చెత్తతో బయో మైనింగ్ ద్వారా తయారవుతున్న సేంద్రియ ఎరువును నగరంలోని ఇంటింటికీ పంపిణీ చేసే మొక్కలకు ఉపయోగిస్తే బాగుంటుందన్నారు. దీనిని కనీస ధరకు విక్రయించాలని సూచించారు. ఆయన స్వయంగా 2 కిలోల ఎరువును తీసుకెళ్లారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

220 పాఠశాలలకు డ్యూయెల్ డెస్కులు సరఫరా


వేంకటేశ్వరకాలనీ పాఠశాలలో డ్యూయెల్ డెస్కులను ప్రారంభించిన ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సర్కారు బడుల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. అందులో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు కూర్చునేందుకు డ్యూయెల్ డెస్కులను పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. జిల్లాకేంద్రంతోపాటు పలు మండలాల్లో అధిక సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలలకు మొదటి ప్రాధాన్యత కింద డెస్కులను పంపిణీ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 712పాఠశాలలు ఉండగా.. గతంలో 'మన ఊరు–మనబడి'కింద 90 పాఠశాలలకు వెయ్యికిపైగా డ్యూయెల్ డెస్కులను పంపిణీ చేసింది. సోమ, మంగళవారాల్లో మరో 220 పాఠశాలలకు 2,880 డ్యూయెల్ డెస్కులను పంపిణీ చేసింది. ఇందులో ఒక్కో పాఠశాలలో 180నుంచి 220వరకు డెస్కులను పంపిణీ చేశారు. మిగిలిన పాఠశాలలకు కూడా త్వరలోనే డ్యూయెల్ డెస్కులను పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. మిగిలిన పాఠశాలలకు కూడా త్వరలో రానున్నాయని తెలిపారు. జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వరకాలనీ పాఠశాలలో ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ హెచ్‌ఎం రవితో కలిసి ప్రారంభించారు.

పోగొట్టుకున్న బ్యాగ్‌ను గుర్తించిన పోలీసులు


బ్యాగ్, ల్యాప్‌టాప్ అందజేస్తున్న సీఐ ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్ క్రైం: ఆటోలో ప్రయాణం చేసిన విద్యార్థిని.. దిగేక్రమంలో బ్యాగ్ మరిచిపోయింది.. ఆ తర్వాత బ్యాగ్ లేదని గమనించేసరికి ఆటో వెళ్లిపోయింది. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న వందన ఈనెల 8న రాత్రి అశోక్ టాకీస్ చౌరస్తాలో ఆటో ఎక్కింది. తనవెంట ఉన్న బ్యాగును ఆటో సీటు వెనుకభాగంలో పెట్టి దిగేక్రమంలో మరిచిపోయింది. కాసేపు తర్వాత బ్యాగ్ కోసం చూసుకోగా ఆటోలోనే వదిలేసినట్లు గ్రహించింది. సీసీకెమెరాల సహాయంతో ఆటోను గుర్తించి విద్యార్థిని బ్యాగ్‌లో దాంట్లో ఉన్న విలువైన ఐప్యాడ్, డబ్బులు ఇతర సామగ్రిని బుధవారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బ్యాగ్‌ను గుర్తించడంలో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బంది శేఖర్, వెంకట్రాములు, అశోక్, కురుమూర్తిని సీఐ అభినందించారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

భూత్పూర్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో భూత్పూర్ మున్సిపల్ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిల్లె గోపాల్ మాట్లాడుతూ.. కార్మికులకు 8గంటల పనిదినాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, డ్రస్సులు, నూనేలు, గ్లౌజులు, షూలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ గౌరవాధ్యక్షుడిగా కురుమూర్తి, సలహాదారుడిగా ఖమర్ అలీ, అధ్యక్షుడిగా మాసమ్మ, ఉపాధ్యక్షులుగా చిన్నవెంకటయ్య, చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు, సహాయ కార్యదర్శులుగా రవికిరణ్, రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

మహమ్మదాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మట్టిలో మాణిక్యాలాంటి ఉత్తమ క్రీడాకారులను వెలికి తీయాలని ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. బుధవారం నంచర్ల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం జట్లను అభినందించి విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో మహమ్మదాబాద్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణ బుధవారం సన్మానించారు. ఎంఈఓ రాజునాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి సమీపంలోని దుందుభీ వాగు నుంచి బుధవారం తెల్లవారుజామున అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. వల్లభ్‌రావుపల్లికి చెందిన ట్రాక్టర్‌గా గుర్తించి ట్రాక్టర్ ఓనర్ ప్యాట శ్రీకాంత్‌పై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాళంవేసిన ఇంటికి కన్నం

రాజాపూర్: మనుమడి ఫంక్షన్‌కు వెళ్లేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళం విరగ్గొట్టి ఇంట్లోన్న వెండి వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం బాలానగర్ మండలం చిన్నరేవల్లిలో చోటుచేసుకుంది. రాజాపూర్ ఎస్‌ఐ శివానందంగౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొంగళ్ల ఇందిరమ్మ మంగళవారం కామారెడ్డి జిల్లాలో తన మనుమడి తొట్టెలకు భార్యాభర్తలు వెళ్లారు. ఫంక్షన్‌లో పాల్గొని రాత్రి పదకొండున్నర గంటలకు తిరిగి గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తాళం విరగొట్టి ఉండడంతో ఆందోళన చెంది ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువా తాళం కూడ విరగొట్టి అందులో ఉన్న 20 తులాల వెండి కడియాలు, 5 తులాల వెండి చెక్కుబిల్లాతోపాటు 1.5 మాసాల బంగారు వస్తువులు, కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్‌వీకేఎంలో ఘనంగా ఇన్వెస్టిచర్

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి వద్ద ఉన్న ఎస్‌వీకేఎం స్కూల్‌లో బుధవారం 2025–26కు సంబంధించి ఇన్వెస్టిచర్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌స్టాలేషన్‌ను గుర్తించింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథి సుమన్ నరేడ్ల మాట్లాడుతూ.. అకాడమిక్స్, ఇన్నోవేషన్‌లో ఉనత్న లక్ష్యాలు సాధించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డా.ఎబినేజర్ యువ నాయకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్పాట్ లైట్ హెడ్‌బాయ్ కార్తికేయన్‌రెడ్డి, హెడ్ గర్ల్ షారన్ రోజ్, డెప్యూటీ లీడర్లు, హౌస్ కెప్టెన్లు వారి బ్యాడ్జిలను స్వీకరించారు.